www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 11 | జనవరి | 2025
పేజీలు 8

## డబుల్ ఇళ్ల లొల్లి..!

పురుగు మందు డబ్బాలతో నిరసన



2 లో

# భద్రాద్రిలో వైభవంగా ముక్కోటి ఏకాదశి ఉత్సవం

- ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చిన రామయ్య
- రామనామ స్మరణతో మార్మోగిన భద్రగిరి





ప్రజాపక్షం/భద్రాచలం : శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఉత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్నులారా రామదర్శనం పొందిన భక్తులు జై శ్రీరాం అంటూ జయజయధ్వనాలు చేశారు. వేదపండితులు ముక్కోటి విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిఐపి,విఐపి సెక్టార్లతో పాటు ఇతర సెక్టార్లలోని భక్తులు వేడుకను తిలకించారు. ఇందులో భాగంగా 108 ఒత్తులతో

మిగతా 2లో..

## పెద్దరాయుళ్ల కట్టుబాటు
# కరువాయె..!



- పల్లెల్లో మసకబారుతున్న పెద్దరికపువాయులు
- ఇరు వర్గాలను ఏకతాటిపైకి తెచ్చే నాథులే కరువు
- ఊళ్లల్లో పెరుగుతున్న పంతాలు, పట్టింపులు
- చిన్నపాటి వివాదాలతో ఠాణాలకే పరుగు

ప్రజాపక్షం/కొణిజర్ల : కలెక్షన్ కింగ్ మోహన్ బాబు నటించిన పెద్దరాయుడు సినిమా గురించి తెలియనివారుండరు. ఆ చిత్రంలో పెద్దరాయుడు చెప్పిందే ఆ ఊరిలో వేదం. గ్రామంలో ప్రజల నడుమ ఎలాంటి సమస్యలు తలెత్తినా ఆయా పంచాయతీలను ఆ పెద్ద మనిషి పరిష్కరించే తీరు ప్రేక్షకులను అబ్బురపరుస్తుంది. మరో విషయమేమిటంటే ఆ పంచాయతీలో తీర్పు గ్రామ ప్రజలకే కాదు. నిందితులు, బాధితులకు సైతం ఆమోదయోగ్యంగా ఉండటమే అక్కడ విశేషం. పల్లె ప్రాంతాల్లో పెద్ద మనుషుల పాత్రను కళ్లకు కట్టిన ఆ సినిమా అప్పట్లో ఘన విజయమే సాధించింది. వాస్తవానికి కూడా నాడు పల్లెల్లో సమస్యల పరిష్కారానికి పెద్ద మనుషులే అన్నీ తామై నడుం బిగించేవారు. చట్టాలు, శాసనాలు వారి నాలుకపై

మిగతా 2లో..

## రైతుల సంక్షేమానికి
# తొలి ప్రాధాన్యత



- లాభసాటి పంటలను సాగు చేయాలి
- నూతన సహకార సంఘాలకు ప్రతిపాదనలు సమర్పించాలి
- రోడ్ల నిర్మాణం, గోదాం నిర్మాణానికి శంకుస్థాపన
- సొసైటీ, జిపి భవనాలను ప్రారంభించిన మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/సత్తుపల్లి : రైతాంగ సంక్షేమమే తొలి ప్రాధాన్యతగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సత్తుపల్లి మండలంలో పర్యటించి స్థానిక ఎంఎల్ఎ మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి, సింగరేణి వ్యవసాయ గోదాం నిర్మాణ పనులకు, బుగ్గపాడు గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు నిర్మాణ పనులకు, కాకర్లపల్లి గ్రామంలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కాకర్లపల్లి గ్రామంలో నిర్మించిన కో ఆపరేటివ్ సొసైటీ భవనాన్ని, జిపి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కొత్తగూడెం పాల్వంచ ప్రాంతంలో కొత్త విమానాశ్రయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని

మిగతా 2లో..

# రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యత





(మొదటిపేజీ తరువాయి)

ఈనెలలో బృందం పర్యటన కూడా ఉంటుందని మంత్రి తెలిపారు. పొలాలకు నీరు, పిల్లలకు చదువు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. బేతుపల్లి కాలువ తన హయాంలో పూర్తి చేశామని, వేంసూరు మండలం నేడు పచ్చగా తయారైందన్నారు. ఈ మండలంలో యువత అమెరికాలో సంపాదించి నేడు హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ప్రారంభించారని, 40 ఏళ్ల క్రితం త్రాగునీరు లేని గ్రామాలు నేడు పంటల మయం చేశామని మంత్రి తెలిపారు. సత్తుపల్లి నియోజక వర్గంలో కొత్త వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటుకు స్థానిక ఎంఎల్‌ఎతో సమన్వయం చేసుకుని ప్రతిపాదన పంపాలని మంత్రి సూచించారు. సహకార సొసైటీలను బలోపేతం చేయడం ద్వారా ఎరువులు, గోదాములే కాకుండా యంత్ర సామాగ్రి కూడా అందించే కార్యక్రమానికి శ్రీకారం చూడుతున్నామని మంత్రి తెలిపారు. రైతుల ముఖాల్లో చిరునవ్వు ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ. 21వేల కోట్ల రుణమాఫీ చేశారని, రైతుబీమా క్రింద మూడు కోట్లు, రైతు బంధు క్రింద రూ.7,600కోట్లు అందించారన్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా క్రింద రైతుల ఖాతాల్లో దాదాపు రూ. 10వేల కోట్లు జమ చేయబోతున్నామన్నారు. రాబోయే పంట సీజన్ నుంచి రైతులకు పూర్తి స్థాయిలో పంట బీమా కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్న రైతుల సంక్షేమం కోసం తొలి ఏడాది రూ. 40వేల కోట్లు ఖర్చు చేశామని మరో రూ. 10వేల కోట్లు రైతాంగ పథకాల కోసం ఖర్చు పెడతామన్నారు. రైతులు లాభసాటి పంటలు సాగు చేయాలని మంత్రి తెలిపారు. సత్తుపల్లి ఎంఎల్‌ఎ మట్టా రాగమయి మాట్లాడుతూ కాకర్లపల్లి గ్రామంలో బిటి రోడ్డు, సహకార సంఘం భవనాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. సహకార సంఘం ద్వారా రైతులు లబ్ది పొందాలని ఎంఎల్‌ఎ ఆకాంక్షించారు. మన వ్యవసాయ శాఖ మంత్రి స్వయంగా రైతు కనుక రైతుల కష్ట నష్టాలను తెలుసుకుని దానికి అనుగుణంగా పథకాలను ప్రవేశపెడుతున్నారని ఆమె తెలిపారు. సన్న రకం వడ్లకు బోనస్ అందించడం వల్ల ప్రతి రైతుకు ఎకరానికి రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు లాభం వచ్చిందన్నారు. పెండింగ్‌లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం పనులకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారని త్వరలో యతాలకుంట వద్ద టన్నెల్ పూర్తి చేసుకుని సత్తుపల్లి, వేంసూరు మండలాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి పనుల కోసం డిఎంఎఫ్‌టి నిధులు రైతులకు ఉపయోగపడే చెక్‌డ్యాం, పొలాలకు వెళ్లే దారుల కోసం మంజూరు చేయాలని ఆమె తెలిపారు. అనంతరం సత్తుపల్లి మండలంకు చెందిన 59 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, కల్లూరు ఆర్డివో ఎల్. రాజేందర్, సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆనంద్, సత్తుపల్లి తహసీల్దార్ యోగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో వైభవంగా
# ముక్కోటి ఏకాదశి ఉత్సవం

(మొదటిపేజీ తరువాయి)

హారతిని వెలిగించిన అర్చకులు స్వామికి హారతిపట్టారు. సుగంధ ద్రవ్య పరిమణాల సువాసలతో ముక్కోటి వేడుగా కన్నులపండువగా సాగింది. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి రాజవీధిలో స్వామిని ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో అన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖామంత్రి సతీమణి పొంగులేటి మాధురీ రెడ్డి, ఎంపి పోరిక బలరామ్ నాయక్, భద్రాచలం, పినపాక, ఇల్లెందు శాసనసభ్యులు డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు, ఏఎస్‌పి విక్రాంత్ సింగ్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, దేవస్థానం ఇఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇళ్ల లొల్లి..!

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** అర్హత లేని వారికి అందించి.. అర్హత ఉన్న వారికి ఇవ్వకుండా... గ్రామ సభ నిర్వహించకుండా డబుల్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఏకపక్షంగా చేశారని, ఆరోపిస్తూ గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. పురుగు మందు డబ్బాలతో ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనటంతో అధికారులు ఘట నా స్థలం కు సందర్శించి, ఆందోళనకారులతో చర్చించి, ఆందోళన విరమించారు. వివరా లు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని ఆచార్లగూడెం లో పంపిణీ కి సిద్ధంగా ఉన్న 18 డబుల్ ఇళ్లు వద్ద ఉద్రికత్త, పరిస్థితులు నెలకొన్నాయి. శుక్రవారం డబుల్ ఇళ్ల ను సిద్ధం చేస్తుండుగా గ్రామస్తులు పనులు అడ్డుకున్నారు. ఇళ్ల వద్ద గ్రామస్తులు కొంత మంది నిరసన వ్యక్తం చేశారు. ఇళ్ల వద్దకు అధికారులు రాకుండా ముళ్ల కంచె ను వేసి నిరసన వ్యకం చేశారు. లబ్ధిదారులను గ్రామ సభ.గ్రామస్తులు వెసులు అడ్డుకున్నారు. ఇళ్ల వద్ద గ్రామస్తులు కొరత మంది నిరసన వ్యక్తం చేశారు. ఇళ్ల వద్దకు అధికారులు రాకుండా ముళ్ల కంచె ను వేసి నిరసన వ్యక్తం చేశారు. లబ్ధిదారులను గ్రామ సభ నిర్వహించకుండానే కొంత మంది ఏకపక్షం గా ఎంపిక చేశారని ఆందోళన చేపట్టారు. కొంత మంది మహిళలు పురుగు మందు డబ్బాలు పట్టుకుని ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఎంపిక చేసిన వారిలో అనర్హులు ఉన్నారని, అర్హత కలిగిన వారికి మాత్రమే అందించాలని డిమాండ్ చేశారు. అధికారులకు వ్యతిరేకం గా నినాదాలు చేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న నేలకొండపల్లి తహాశీల్దార్ జె.మానిక్రావ్, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ఆలస్యం మధుసూధన్ రావు ఘటనా స్థలం కు చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించారు. ఇంకా అర్హత కలిగిన వారు ఉంటే జాబితా ను ఇవ్వాలని, ఈ విషయం ను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పటంతో లబ్ధిదారులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెద్దరాయుళ్ల కట్టుబాటు కరువాయె..!

(మొదటిపేజీ తరువాయి)

నుంచే జాలువారేవి. ఈ ఫలితంగా పోలీస్ స్టేషన్లలో కేసుల సంఖ్య అత్యల్పంగానే ఉండేది. పల్లెల్లో పెద్ద మనుషుల పాత్ర నిజంగా ఎంతో ప్రత్యేకం. వాళ్లు రోడ్డుపై నడిచి వెళుతుంటే ఊరి జనమంతా చేతులు జోడించి నమస్కరించేవారు. ఇక మహిళల గురించి చెప్పాల్సిన పనేలేదు. ఆ వీధిలో పెద్ద మనిషి వస్తున్నాడంటే మహిళలు వెనుదిరిగి వెళ్లే సందర్భాలు కూడా కనిపించేవి. వ్యాపారులు, వర్తకులు, కుల వృత్తిదారులు, రైతులు ఇలా అన్ని వర్గాల ప్రజలు పెద్ద మనుషులను ఎంతో గౌరవించేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే వారి కళ్లలోకి చూసి మాట్లాడే సాహసం చేసే వారు చాలా తక్కువ మందే ఉండేవారు. ఇక గ్రామ పెద్దలంటే పిల్లలు వణికిపోయేవారు.

**వారు చేసిందే శాసనం...**

గ్రామీణ ప్రాంతాలు పట్టణాలకు పూర్తిగా భిన్నమైన సంస్కృతిని కలిగి ఉంటాయి. పల్లెల్లో మాటకి కట్టుబాటు ఎక్కువ. కొన్ని సందర్భాల్లో గ్రామ పెద్దల మాటను గౌరవించని వారికి గ్రామ బహిష్కరణ శిక్షను కూడా విధించేవారు. ఇక ఊళ్లల్లో నెలకొనే భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, అన్నదమ్ముల పంచాయతీలు, గెట్టు పంచాయతీలు, భార్యా భర్తల వివాదాలు ఇలా ఒక్కటేమిటి సమస్య ఏదైనా పరిష్కారం చెప్పాల్సింది మాత్రం ఆ పెద్ద మనుషులే. ఇరు వర్గాల నుంచి సమస్యను సానుకూలంగా విని దాన్ని ఆకళింపు చేసుకున్న తర్వాతే వారు తీర్పును వెలువరించేవారు. ఎందుకంటే ఆ తీర్పు ఆషామాషీగా ఉంటే వారి పెద్దరికానికే తలవంపులు తెచ్చిపెడుతుంది మరి. పెద్దలు చెప్పే తీర్పు గ్రామ ప్రజలందరికీ ఆమోద యోగ్యంగా ఉన్నప్పుడే ఆ గ్రామ పెద్దకు మరింత విలువ పెరుగుతుంది. ఇలా రచ్చబండల వేదికగా చేసే పంచాయతీల్లో పెద్దరాయుళ్ల పాత్ర పోషించే గ్రామ పెద్దలు చెప్పిందే చట్టంగా, చేసిందే శాసనంగా ఉండేది. ఉదాహరణకు గ్రామాల్లో వ్యవసాయ రైతు కూలీలకు గిట్టుబాటు ధరను పెంచే విషయంలోనూ పెద్దమనుషులు కీలక భూమిక పోషించేవారు. గ్రామంలో మోతుబరి రైతులను కూర్చోబెట్టి రైతు కూలీల సాదకబాధకాలను వివరించి మరీ రైతుల కూలీల వేతనాన్ని పెంచి వారికి ఊరట కల్పించేవారు.

**మసకబారుతున్న పెద్దరికపుచాయలు...**

నాటి పెద్దరాయుళ్లు ఇప్పుడు కనుమరుగైపోతున్నారు. మాటలనే శాసనాలుగా మార్చే పెద్దలు కాలగర్భంలో కలిసిపోతున్నారు. అలాంటి పెద్ద మనుషులు



ఇప్పుడు ఆనవాళ్లుగానే మిగిలిపోతున్నారు. వారి స్థానాన్ని స్వీకరించే మరో పెద్ద మనిషి కూడా లేకుండా పోతున్నాడు. ఫలితంగా పల్లెల్లో పెద్దరికపు ఛాయలు క్రమంగా మాయమైపోతున్నాయి. ఏదైనా సమస్య తలెత్తితే ఇరు వర్గాలను కూర్చోబెట్టి వారిని ఏకతాటిపైకి తీసుకొచ్చే నాధులే లేకుండా పోయారు. ఫలితంగా జనం మధ్య వివాదాలు నానాటికీ పెరుగుతున్నాయే తప్ప తగ్గుముఖం పట్టడం లేదు. ప్రతి చిన్న విషయానికీ కాలుదువ్వి కత్తులు దూసుకునే వరకూ పరిస్థితి చేరుతోంది. పంతాలు, పట్టింపులతో పల్లెల్లో ప్రజలు నిత్యం కారాలు, మిరియాలు నూరుకుంటున్నారు. వీరి నడుమ తలెత్తుతున్న వివాదాలను సమసిపోయేలా చేసి మధ్యవర్తిత్వం నడిపే పెద్దరికం నానాటికీ కనుమరుగైపోతుంది. నాటి పెద్దమనుషులు బంధుప్రీతి లేకుండా తప్పు చేసిన వారిని మొహమాటంలేకుండా ఖండించి తీర్పు చెప్పేవారు. తప్పును తప్పని నిర్మొహమాటంగా వెల్లడించేవారు. కాని నేటి పెద్ద మనుషులు ఓటుబ్యాంకు రాజకీయంగా వ్యవహరించడం తప్పుచేసిన వారిని నీవుచేసింది తప్పని ఖండించి చెప్పలేకపోతున్నారు. ఖండించి చెపితే ఇద్దరిలో ఒకరు తమకు దూరమవుతారని ఎందుకు దూరం చేసుకోవాలని అనుకోవడంతో సమస్యలు పరిష్కరించలేకపోతున్నారు. దీంతో మొగుడు పెళ్లాల పంచాయతీ మొదలుకుని భూ వివాదాల వరకు ఏ సమస్య తలెత్తినా ఆవేశాలకులోనై పోలీస్ స్టేషన్లకు పరుగెత్తడం పరిపాటిగా మారుతోంది. దీంతో పల్లెల్లో ప్రతి వివాదం కూడా అధికారికంగా పోలీస్ ఠాణాలో నమోదవుతున్న పరిస్థితి నెలకొంది. ఫలితంగా పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదుల సంఖ్య కుప్పలు తెప్పలుగా పెరిగిపోతున్నాయి. ఉదయం, సాయంత్రం అంటూ చెప్పులు అరిగేలా తిప్పించుకుంటున్న పోలీసులు నెలలు గడిచినా ఆయా సమస్యలకు పరిష్కారం చూపలేకపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చిన్నపాటి సమస్యలకు కూడా చాకచక్యంగా పరిష్కారం చూపలేకపోతున్న పోలీసులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్న దుస్థితి నెలకొంది. కొన్ని వివాదాలు కోర్టు మెట్లెక్కడంతో నెలనెలా వాయిదాలకు తిరుగుతున్న బాధితులు, నిందితులు తమ జీవితాలను కర్పూరంలా కరిగించుకుంటున్నారు. మొత్తమ్మీద పల్లెల్లో పెద్దమనుషుల ప్రాభవం కనుమరుగవుతున్న క్రమంలో పోలీస్ స్టేషన్లకు, కోర్టులకు వరుస కడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తగ్గేదేలే.. అంటూ పంతానికి పోతున్న జనం చివరికి తమ విలువైన సమయాన్ని, జీవితాన్ని కోల్పోతున్నారు.

**అది స్టేషన్ మెట్లెక్కని గ్రామం...**

జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో ఉన్న తనికెళ్ల గ్రామం నుంచి ఒక నాడు పోలీస్ స్టేషన్‌లో ఒక్క ఫిర్యాదు నమోదు కాలేదు. తనికెళ్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల శాంతి భద్రతల రీత్యా 195657 సంవత్సరంలో తనికెళ్లలో పోలీస్ స్టేషన్‌ను నెలకొల్పారు. అయితే 1985 వరకు సుమారు రెండు దశాబ్దాల కాలంగా ఒక్క ఫిర్యాదు కూడా నమోదు కాకపోయేసరికి పోలీస్ స్టేషన్‌నే ఎత్తివేయడం గమనార్హం. ఈ గ్రామంలో పోలీసుల సమస్యలను కూడా పెద్దమనుషులే పరిష్కరించేవారంటే ఆశ్చర్యం కలుగకమానదు. తెలంగాణ సాయుధ పోరాట యోధులు గడల సీతారామయ్య, తనికెళ్ల ప్రధమ సర్పంచ్ యాసా వెంకట లాలయ్య, నాటి పోలీస్ పటేల్ యాసా రాంభద్రయ్య, తుళ్లూరు పెద్ద సత్యం, పేరసాని అప్పయ్య, తుళ్లూరు జగ్గయ్య, యాసా లక్ష్మీ నర్సింహారావు, యాసా అనంత రామయ్య, గాజుల కృష్ణమూర్తి, పసుమర్తి సూర్యం, మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య, ఆకుతోట వెంకయ్య, పిన్నం సత్యం, పెదమల్ల నారాయణ, తీర్థం వెంకటప్పయ్యశాస్త్రి, అల్లూరి వెంకటేశ్వర్లు, తుళ్లూరు చిన్నసత్యం వంటి మరికొందరు ప్రముఖులు తనికెళ్ల గ్రామ పెద్దలుగా వ్యవహరించే వారు. అలాగే కొణిజర్లలో దొండపాటి వెంకయ్య, సాధు లక్ష్మీకాంతయ్య, సామినేని నారాయణ, కొమ్మిన్ని వెంకట్రామయ్య, జట్ల లక్ష్మయ్య, దొండపాటి వెంకయ్య అనుచరులుగా బోడపోతుల రాంబ్రహ్మం, బండారు హనుమంతరావు. మహబూబ్ అలి, డాక్టర్ ఖాదర్ లాంటి వాళ్లుకూడా పెద్దలు గ్రామ సమస్యల పరిష్కారంలో కీలక పాత్ర పోషించేవారు.

# సైన్స్ ఫెయిర్‌లో ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు ప్రథమ స్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్లలో ఎస్‌వికెఎం పాఠశాలలో ఈనెల ఏడు నుంచి తొమ్మిది వరకు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొని వారి ప్రాజెక్టులను ప్రదర్శించారు. మొత్తం ఏడు సబ్ థీమ్‌లు కలిగిన ఈ పోటీలలో ఖమ్మంకు చెందిన ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ తొమ్మిదవ తరగతి విద్యార్థులు సత్యసాయి, యశ్వంత్‌లు ప్రదర్శించిన ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యూనికేషన్ ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. అదేవిధంగా ఎస్ఎఫ్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన స్మార్ట్ కార్ అండ్ స్మార్ట్ కమ్యూనికేషన్ ప్రాజెక్టు ద్వారా రైతులు పండించిన పంటలు ఎండలో పెట్టినప్పుడు అకాల వర్షాల వల్ల తడిచిపోతున్నాయి. అలా తడిచిపోకుండా సెన్సార్ ద్వారా రైతులకు సమాచారం అందిస్తుంది. అదేవిధంగా కొన్ని ప్రత్యేక సెట్టింగ్‌ల ద్వారా రూరల్‌లోని పేద ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు, కోస్టల్ ఏరియాలోని ప్రజలు అప్రమత్తం అయ్యేలా సమాచారం అందించి వారి జీవితాలను కాపాడుతుంది. ఈ ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుకు గైడ్ టీచర్‌గా కె. రోశయ్య వ్యవహరించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ కె. రోశయ్యను పాఠశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ రాజిరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సృజనాత్మకత పట్ల ఆసక్తి కలిగి ఉండాలని, తాము నేర్చుకున్న అంశాలు ప్రజలకు మేలు చేసేవిధంగా ఉండాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఇలాంటివి మరెన్నో ప్రాజెక్టులు సమాజశ్రేయస్సుకు ఉపయోగపడేలా తయారు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవరెండ్ సిస్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగజిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలి



**ప్రజాపక్షం/ తల్లాడ :** కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ సరిహద్దులో గత 46 రోజులుగా అమరణ నిరాహారదీక్ష చేస్తున్న జగజిత్ సింగ్ దల్లేవాల్ ప్రాణాలను కేంద్ర ప్రభుత్వం కాపాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ కోరారు. తల్లాడలోని స్థానిక దొడ్డ కృష్ణయ్య భవనంలో శుక్రవారం తెలంగాణ సంఘం తల్లాడ మండల కమిటీ సమావేశంలో కళ్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన రైతులకు నష్టపరిచే నల్లచట్టాలను అమలు చేసే ప్రయత్నం చేస్తుందని, అనేకసార్లు రైతు సంఘాలు ఎస్కెయం పిలుపు మేరకు పలు నిరసనలు తెలియచేసినా కేంద్ర ప్రభుత్వం నుండి స్పందన రాలేదన్నారు. 62 సంవత్సరాల వయసున్న దల్లైవాల్ 46రోజులుగా అమరణ నిరాహారదీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని, ఆయనకు ఏమైనా జరిగితే దానికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, రైతులందరిని సమీకరించి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈసమావేశంలో జిల్లా రైతు సంఘం నాయకులు సేలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి నల్లమోతు మోహన్‌రావు, అయినాల రామలింగేశ్వరరావు, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, షేక్.నన్నెసాహెబ్, షేక్.మస్తాన్, సైదులు, ముచ్చింతాల చెన్నయ్య, పాకాలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

**-సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రజల్లో అవగాహనకు విస్తృత ప్రచారం చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి.శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ రోడ్డు ప్రమాదాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వద్ద తప్పనిసరిగా స్కూల్ జోన్ సంబంధిత బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె తెలిపారు. జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రధాన రోడ్లలో అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను మార్క్ చేసుకుని, ప్రమాదాలు జరిగితే దగ్గరలోని ఏ ఆసుపత్రికి తరలించాలి అనే విషయంపై మ్యాపింగ్ చేయాలని, ప్రమాదాల స్థలాల సమీపంలోని ఆసుపత్రులలో అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే 1033కు ఫోన్ చేయాలని దీనిపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద స్పీడ్ లిమిట్ బోర్డులను, యాక్సిడెంట్ ప్రోన్ ఏరియా స్టిక్కర్లను ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. జిల్లాలో ఆర్టిసి బస్సులు బస్ స్టాప్, బస్ బే ల వద్ద ఆపేలా డ్రైవర్లకు సూచనలు జారీ చేయాలని ఆమె తెలిపారు. రోడ్డు భద్రత ప్రమాణాలపై ప్రభుత్వంలోని డ్రైవర్లు, ఆర్టిసి డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అంబులెన్స్ వచ్చేందుకు ఆటో అడ్డా వద్ద ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలలో రోడ్లపై ఆక్రమణలు ఉంటే వెంటనే తొలగింపుకు చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, త్రిబుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, సీటుబెల్ట్ ధరించకపోవడం, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం, అతివేగం వంటివి ప్రమాదకరమని, చట్ట ప్రకారం నేరమని ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తేవాలన్నారు.ఈ సమావేశంలో ఆర్అండ్‌బి ఎస్ఈ హేమలత, డిపివో ఆశాలత, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ఆర్టివో వెంకటరమణ, ఏసిపి శ్రీనివాసులు, విద్యాశాఖ ఆర్ఎంవో రాజశేఖర్, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు,లారీ ఓనర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రఘురాంప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని బురదరాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. పాఠశాలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవు రావడంతో ముందస్తుగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినిలు రంగురంగులతో రకరకాలుగా ముగ్గులు వేసి చూపరులను ఆకట్టుకునే విధంగా వేశారు. విద్యార్థులు గంగిరెద్దు ఆకారంలో తయారై ఊరేగింపుగా చేసి విద్యార్థులను ఉల్లాసపరిచారు. ముగ్గుల పోటీల్లో రంగురంగులతో ముగ్గులు వేసిన విద్యార్థినిలకు ఎంఈవో శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సాయి॥ సుజాత, ఉపాధ్యాయులు భారతి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# గణేశ్వరం పాఠశాలలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సంక్రాంతి సందర్భంగా గణేశ్వరం యూపిఎస్ పాఠశాలలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. శుక్రవారం ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు ఆధ్వర్యంలో విద్యార్థినిలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. విజయశ్రీ బహుమతులను ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు రఫీక్ పాషా, వెంకటేశ్వరరావు, విజయలక్ష్మి , మజార్ లు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయాల్లో ఉత్తర ద్వారదర్శనం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వైకుంఠ ఏకాదశి ముక్కోటి సందర్భంగా పలు ఆలయాల్లో స్వామి వారు ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో ముక్కోటి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చేలా ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. వి. వెంకటాయపాలెంలోని రామాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీతారామ చంద్రస్వామిని ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు వీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



**ప్రజాపక్షం/ మధిర :** ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా మధిర పట్టణంలో వైష్ణవ ఆలయాలన్ని భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని బంజారాకాలనీలో వేంచేసియున్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, వర్తకసంఘంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయం తదితర ఆలయాలను తెల్లవారుజాము నుండే భక్తులు అధికసంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ముక్కోటి ఏకాదశి కావటంతో ఆలయాలకు వచ్చిన భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శన సౌభాగ్యాన్ని కల్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయాల నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హామీలను అమలు చేయాలి



**ప్రజాపక్షం/ మధిర :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బిజెపి కిసాన్‌మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిజెపి కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో డిమాండ్స్ కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతు రుణ మాఫీ అమలు చేయాలని, రైతు భరోసా రూ.15వేలు ఇవ్వాలని, భూమిలేని పేదలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన తెలంగాణలో అమలు చేయాలని తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాపట్ల రమేష్, చిలువేరు సాంబశివరావు, రామిరెట్టి నాగేశ్వరరావు, దేవరకొండ కోటేశ్వరరావు, పగడాల నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ ఫ్రాన్సిస్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు




**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని సెయింట్‌ఫ్రాన్సిస్ స్కూల్ నందు శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. హిందువుల ముఖ్య పండుగైన సంక్రాంతి సందర్భంగా పాఠశాల నందు విద్యార్థినిలు రంగు రంగుల అందమైన ముగ్గులు వేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మేరి థామస్ మాట్లాడుతూ తెలంగాణ సంసృ్కతి, సాంప్రదాయాలను ప్రతిఒక్కరూ గౌరవించాలని, విద్యార్థులు తమ సాంప్రదాయాలు, వాటి ప్రాముఖ్యతను తెలుసుకునేందుకు సంక్రాంతి సంబరాలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సిస్టర్ ఆన్‌బేబి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాచారం ఆలయంలో ఖమ్మం జిల్లా జడ్జి పూజలు



ప్రజాపక్షం/ఏన్కూరు: మండల పరిధిలోని నాచారం శ్రీఅద్భుత వెంకటేశ్వరస్వామి దేవాలయంలో జిల్లా జడ్జి రాజగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్ కుటుంబ సభ్యులు శుక్రవారం దేవాలయాన్ని సందర్శించారు. ఈస ందర్భంగా దేవాలయ ఈవో శేషయ్య ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ మర్యాదలతో న్యాయమూర్తి కుటుంబానికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి శేష వస్త్రంతో న్యాయమూర్తిని సత్కరించారు. శ్రీవెంకటేశ్వర స్వామి, పద్మావతి అమ్మవార్ల విశిష్టత గురించి ఆయనకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు శ్రీనివాసాచార్యులు, సత్యనారాయణచార్యులు, తిరుమల సత్యనారాయణచార్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర ద్వారదర్శనంలో శ్రీకోందడరామస్వామి



ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని ముష్టికుంట్ల శ్రీ కోదండరామస్వామి దేవాలయం ముక్కోటి ఏకాదశి సందర్భంగా అంగరంగవైభవంగా అలంకరించబడింది. గురువారం రాత్రి నుంచే అలయాన్ని తెరిచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఉత్తర ద్వార దర్శనాన్ని కల్పించారు. ఈ రోజు విష్ణువును దర్శించుకుంటే వైకుంఠం ప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ వైకుంఠ ఏకాదశి రోజున మండలంలోని వైష్ణవ దేవాలయాలలో ఉత్తర ద్వార దర్శనాన్ని వేలాది భక్తులు దర్శించుకున్నారు.

## అక్రమ మట్టి తోలకాలను నిలుపుదల చేయాలి



ప్రజాపక్షం/ మధిర రూరల్ : మధిర మండల పరిధిలోని సిరిపురం, వంగవీడు గ్రామాల మధ్య ఉన్న ఎన్ఎస్పి కాల్వ వద్ద జరుగుతున్న మట్టి అక్రమ తోలకాలను నిలుపుదలచేయాలని మాజీ జెడ్పిచైర్మన్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం అక్రమ మట్టి తోలకాలు జరుగుతున్న ప్రాం తాన్ని బిఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కొత్తపల్లి నర్సింహారావు, చీదిరాల రాంబాబు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## వాణి విద్యానికేతన్ పండుగ సంబరాలు



ప్రజాపక్షం/వైరా: వైరా వాణి వివేకానంద విద్యాలయంలో శుక్రవారం బొమ్మల కొలువు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాణి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు రకరకాల బొమ్మలన్ని ఒక దగ్గరికి చేర్చి వాటిని 9 మెట్లపై అలంకరించారు. పాఠశాల ఆవరణను అంతా మామిడి తోరణాలు అరటి ఆకులతోను లైటింగ్‌తోను అలంకరించారు. పాఠశాలలోని సంక్రాంతి పండుగ వాతావరణం ముందుగానే కల్పించేటట్లు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ దుర్గాదేవి విజయానికి గుర్తుగా ఈ పండుగ జరుపుకుంటారు. దీనిని అలంకరణ 9 మెట్లు వారి కళా దృష్టి ఆకర్షణ సోమత సౌకర్యాలను బట్టి వాళ్ళు ఈ మెట్లపై రకరకాల బొమ్మలను అమర్చారు. ఈ మెట్లపై దేవుని బొమ్మలు ఉంచారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, కన్వీనర్ గింజుపల్లి జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రామ్ చరణ్ చిత్రటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/పాల్వంచ: గ్లోబస్ స్టార్ కొణిదెల రామ్‌చరణ్ నటించిన గేమ్ చేంజర్ సినిమా శుక్రవారం విడుదలై ప్రపంచ వ్యాప్తంగా సూపర్ డూపర్ హిట్ అయిన సందర్భంగా పాల్వంచ మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు ఖాసీం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర థియేటర్ నందు ముందుగా రామ్ చరణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కటింగ్ చేసి అభిమానులకు మిఠాయిలు పంచిపెట్టి, సంబురాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఖాసీం మాట్లాడుతూ రామ్ చరణ్ ఇలాంటి తెలుగు సినిమాలు ఎన్నో తీసి ఇండస్ట్రీ రికార్డులను సృష్టించాలని మనస్ఫూర్తిగా ఆ దేవుని కోరుకున్నారని అన్నారు. ఈకార్యక్రమం బ్రహ్మం మస్తాన్ సాయి, దేవా, సిద్ధు, మీరావలి, సమీర్, రసూల్, భాష తదితరులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ కార్డులపై చిగురించిన ఆశలు..!



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కొత్తగా రేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి. సుమారు దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్న పేదల ఎదురుచూపులు ఫలించనున్నాయి. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డులు జారీకి చర్యలు చేపడుతున్నారు. రేషన్ కార్డుదారులకు త్వరలో సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు ప్రకటించడంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది. గత పదేళ్ల గా రేషన్ కార్డుల జారీ లేక పోవడంతో వేలాది మం ది ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వేల కుటుంబా ల్లో పెళ్లి అయిన యువతి, యువకులు తల్లిదండ్రు లతో విడిపోయి వేరే కాపురం ఉండడం, గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు బతుకుదెరువు కోసం వలస వెళ్లడం తదితర పరిణామాలు చోటు చేసుకు న్నాయి. కానీ కొందరు పురుషుల పేర్లు తల్లిదండ్రుల కార్డుల్లోనే ఉండడం, వారి భార్యాపిల్లల పేర్లు పొందుపరిచే అవకాశం కల్పించ లేదు. దీంతో ఆ కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ప్రభుత్వ పథకాల్లో లబ్ది పొందాలంటే ఆహారభ ద్రత కార్డు తప్పనిసరిగా ఉండాల్సిందే. రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మిగిలారు. సుదీర్ఘకాలంగా నూతన కార్డు లు జారీ చేయకపోవడంతో ఎంతోమంది అర్హులు పథకాలకు దూరమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో నిరుపేదలు కార్డు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. పథకాలు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నా తెల్ల రేషన్ కార్డు నిబంధన ప్రతిబంధకంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో ఒక్కసారి మాత్రమే కొత్త రేషన్ కార్డులు జారీ చేసింది. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి దాని ప్రకారం ఒకసారి రేషన్ కార్డు ల జారీ, పింఛన్ మంజూరు చేశారు. ఆ తర్వాత కొత్త వాటి జోలికి వెళ్లలేదు. ఆ తర్వాత 2014 నుంచి కొత్త కార్డుల జారీ చేయలేదు. కరోనా సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్డు ఉన్న లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. దీంతో కార్డు లేని కుటుంబాల్లో అర్హులు ఉన్నా లబ్ది పొందలేకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన క్రమంలో రేషన్కార్డులు అందజేస్తామని ప్రకటించింది. అందులో భాగంగానే ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించి ఆన్ లైన్ లోనమోదు చేశారు. దీంతోపాటు కార్డుల్లో చేర్పుల కోసం కొందరు దరఖాస్తు చేసుకుంటే, పెళ్లి చేసుకుని తల్లిదండ్రుల నుంచి వేరుగా జీవనం సాగిస్తున్న కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. గతంలో కార్డుల్లో మార్పులు, చేర్పులకు వెసులుబాటు లు కల్పించకపోవడంతో వేలాది మంది పేద లు స్థానికంగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకపోయింది. తాజాగా సీఎం ప్రకటనతో సదరు దరఖాస్తులకు మోక్షం కలిగే అవ కాశం ఉంది. ఈ దరఖాస్తులపై కూడా అధికారులు క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అర్హులకు త్వరగా కార్డు లు అందించాలని కోరుతున్నారు.

## కన్నుల పండుగగా వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం గ్రామంలోని శ్రీకోదండ రామచంద్ర స్వామి దేవాలయంలో ముక్కోటి ఏకదశిని పురస్కరించుకొని వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం శుక్రవారం కన్నుల పండుగగా జరిగింది. పండితుల మంత్రోత్సవాల నడుమ స్వామివారి అభిషేకనంతరం తెల్ల వారుజామున నాలుగు గంటలకు దర్శన భాగ్యాన్ని భక్తులకు కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. అలాగే ఆలయ నిర్వహణ కమిటీ వారు జంటలుగా కూర్చుని ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ముద్రించిన 2025నూతన సంవత్సర శ్రీకోదండ రామచంద్రస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు మిడకంటి పెద్ద వెంకట్‌రెడ్డి, కార్యదర్శి గణపారపు వీరయ్య, ఉపాధ్యక్షులు మామిడి శంకర్‌రెడ్డి, సహాయకార్యదర్శి వెన్నం భాస్కరరావు, కోశాధికారి గణపారపు నాగేశ్వరరావు, సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, చెరుకుపల్లి భాస్కరరావు, రామిడి రమేష్, వల్లేబోయిన వెంకటరమణ, తిప్పిరెడ్డి నరసింహారెడ్డి, తేనె సహదేవ్, ఓరుగంటి శేషగిరిరావు, వెంపటి సురేందర్, నారపాటి రవికుమార్, ఎర్ర ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జగజిత్ సింగ్‌కు మద్దతుగా సిపిఎం ప్రదర్శన



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : రైతులు పండించిన పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ 47 రోజులుగా నిరహర దీక్ష చేస్తున్న రైతు సంఘం నేత జగజిత్ సింగ్ దల్లేవాల్‌కు మద్దతుగా సిపిఎం ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. సుందరయ్య భవన్ నుంచి సరితా క్లినిక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు విధానాలు, కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న విధానాల ఫలితంగా భారతదేశ వ్యవసాయ రంగం అభివృద్ధిచెందడం లేదని ఆయన విమర్శించారు. అంబానీ, అదానీ, బడా పారిశ్రామిక వేత్తల కోసం మోడీ 24 గంటలు పని చేస్తున్నారని ఆరోపించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నను కాపాడటానికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. మూడు నల్ల చట్టాలను కార్పొరేట్ల కోసం అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. మద్దతు ధరల గిట్టుబాటు చట్టం తీసుకు రావాలని నిరహారదీక్ష చేస్తున్న జగజిత్ సింగ్‌కు ఏమైనా అయితే మోడీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని వెంటనే ఆయన చేత నిరహర దీక్షను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, యర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ మాట్లాడుతూ రెండు లక్షల వ్యవసాయ రుణమాఫీని 50% రైతులు మాత్రమే అయిందని, రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి రావడం బాధాకరం అన్నారు. రైతులందరికీ ఎంత అప్పు ఉన్నా సరే మీరు ఇచ్చిన హామీ ప్రకారం రెండు లక్షల రూపాయలు మాఫీ చేయాలన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి పసల బీమా యోజన పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రైతులకు ఇచ్చిన హామీలన్నిటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాదినేని సతీష్, జిల్లా నాయకులు తెల్లం నరసింహారావు, నున్న రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు సిరిపురపు ప్రసాద్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి సిరిపురపు పుల్లారావు, నాగ శ్రీను, వెంకట్రావు, గోపాలరావు, వెంకటేశ్వర్లు, చిలుకూరి కిరణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్టు స్థల పరిశీలనకు కేంద్ర బృందం రాక



**-ఈనెల 20న కొత్తగూడెంలో పలు ప్రాంతాల్లో పర్యటన**
**-విమానాశ్రయ ఏర్పాటుతో మారనున్న జిల్లా రూపురేఖలు**
**-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు తథ్యమని ఈనెల 20న కొత్తగూడెంలోని పలు మండలాల్లో ఎయిర్ పోర్టు ఆథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటిస్తాయని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసి కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి తెలిపారు. నిర్మాణానికి సంబంధించి గతంలో సూచించిన కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో భూములు అనుకూలంగా లేవని అనుమతి నిరాకరించగా, కొత్తగూడెం పరిధిలోని కొత్తగూడెం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లోని పలు భూములను గుర్తించామని అక్కడ సర్వే నిర్వహించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి ఇటీవల లేఖ రాసినట్లు మంతి తుమ్మల తెలిపారు. ఎయిర్ పోర్టు నిర్మాణానికి సాధ్యా సాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం రావాల్సి ఉంటుందని అందుకు అయ్యే ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని లేఖలో తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి తుమ్మల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని స్వయంగా కలిసి పరిస్థితిని వారికి వివరించారు. తక్షణమే స్పందించిన ముఖ్యమంత్రి అందుకు అవసరమయ్యే నిధుల విడుదలకు ప్రత్యేక జివో విడుదల చేశారు. నిధులు మంజూరు చేసిన విషయాన్ని కేంద్రనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూడాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లు లేకుండా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయ నిర్మాణానికి వేగంగా అడుగులు పడుతన్నాయని మంత్రి తెలిపారు. విమానాశ్రయ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా రూపురేఖలు మారనున్నాయని వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. వాణిజ్య, పర్యాటక, పారిశ్రామిక పరంగా అభివృద్ధికి విమానాశ్రయం ఎంతో దోహదం చేస్తుందన్నారు. దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం, సింగరేణి గనులకు పేరుగాంచిన కొత్తగూడెం, అశ్వాపురంలో భారజల పరిశ్రమకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు సైతం వచ్చేందుకు ఈ విమానాశ్రయం ఎంతగానో దోహద పడుతుందన్నారు. ఇప్పటికే కొత్తగూడెం పాల్వంచ కలిపి కార్పోరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించిందని మంత్రి తుమ్మల తెలిపారు. విమానాశ్రయ ఏర్పాటు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ల సహకారం మరువలేనిదని అడిగిన వెంటనే నిధులు మంజూరు చేశారని, ఎయిర్ పోర్టుకు కావాల్సిన భూములను గుర్తించేందుకు సహయ సహకరాలు అందించారని వారికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## పర్సా లక్ష్మీనారాయణ మరణం పార్టీకి తీరని లోటు



**పార్థీవ దేహనికి నివాళులర్పించిన నాయకులు**

ప్రజాపక్షం/మణుగూరు రూరల్: ముత్యాలమ్మ నగర్ గ్రామ పంచాయతీ బీఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ పర్సా లక్ష్మీ నారాయణ (లచ్చు) అకాల మరణం పార్టీ కి తీరని లోటని మణుగూరు మండల, పట్టణ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మ ణ్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో విచారాన్ని వ్యక్తం చేశారు. గత ఐదు రోజులుగా ఊపిరితిత్తులు, లివర్ వ్యాధితో బాధపడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు పరస లక్ష్మీ నారాయణ (లచ్చు) వైద్య చికిత్స పొందుతూ అకాల మరణం చెందడం పార్టీకి తీరని లోటు ఏర్పడిందని అన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ నారాయణ పార్థివ దేహానికి పూలమాలతో నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పర్స లచ్చు చురుకైన కార్యకర్త, అన్ని విషయాలపై అవగాహన కలిగిన యువ నాయకుడని అన్నారు. లక్ష్మీ నారాయణకు భవిష్యత్తు ఎంతో ఉందనుకున్న సమయంలో అకాల మరణం చెందడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసిందని పేర్కొన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మణుగూరు మండల కో కన్వీనర్ బోలిశెట్టి నవీన్, మండల పార్టీ సీనియర్ నాయకులు వట్టం రాంబాబు, ఆవుల నరసింహారావు, తాళ్ళ పల్లి యాదగిరి, యూసఫ్, జావేద్, మేకల రవి, మడి వీరన్నబాబు, బర్ల సురేష్, ఉప్పుతల రామారావు, సకిని బాబూరావు, మూసా, కత్తి రాము, అప్పాజీ, సుధా వెంకటేశ్వర్లు తదితరులు నివాళులు అర్పించారు.

## ఐటిసి సారపాకలో ఐఎన్‌టియుసి జెండా ఎగురవేయాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు:ఈనెల 31న ఐటిసి సారపాకలో జరుగు గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టియుసి మిత్రపక్షాల గెలుపు సాధించి ఐటిసిలో ఐఎన్‌టియూసి జెండా ఎగురవేయాలని మాజీ కేంద్ర మంత్రి వర్యులు, ఎంపీ బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం ఐటిసి గెస్ట్ హౌస్‌లో ఐఎన్‌టియేసి మిత్రపక్షాల నాయకులతో సమావేశమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన కాంగ్రెస్ పార్టీ పరంగానా పరంగా ఐఎన్‌టియూసి కార్మిక సంఘానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ తన వంతు సహకారాలు అందిస్తామని ఐఎన్‌టియూసి మిత్రపక్షాల గెలుపుకై నాయకులు కార్యకర్తలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది గనుక ఐఎన్‌టియూసి మిత్రపక్షాలను గెలిపించుకుంటే, ప్రభుత్వంచే యాజమాన్యం మీద ఒత్తిడి తెచ్చేనా సరైన కార్మికులకు ఆమోద్యయోగ్యమైన వేతన ఒప్పందం చేసుకోవచ్చన్నారు. అనంతరం ఐఎన్‌టియూసి, మిత్రపక్షాల అధ్యక్షులు గోనె రామారావు, ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి, యూనియన్ నాయకులతో పరిశ్రమలో జరగనున్న ఎన్నికల నిర్వాహణ గురించి పరిశ్రమలలో ఉన్న పరిస్థితులు గురించి ఎంపీకి వివరించారు. అనంతరం మోతిలాలు అనే కార్మిక సోదరుడు ఎంపీ బలరాం నాయక్ సమక్షంలో ఐఎన్‌టియూసిలో చేరారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టియూసి మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యులను ప్రభుత్వం గుర్తించాలి



ప్రజాపక్షం/కామేపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్ఎంపీలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సహాయక సంఘం జిల్లా అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం సహాయక సంఘం మండల మహాసభ కొత్త లింగాలలోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో ఆయన మాట్లాడుతూ నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్న తమకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఆర్ఎంపీలకు ప్రభుత్వం ట్రైనింగ్ ఇప్పిచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని, 429 జీవోను అమలు చేయాలని కోరారు. ఈసందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించారు. కార్యకలాపాల నివేదికను మండల ప్రధాన కార్యదర్శి మహబూబ్ రెడ్డి ప్రవేశ పెట్టారు. ఈ మహాసభలో ఆ సంఘం జిల్లా మండల నాయకులు అమృతరావు, సుందర్‌రావు, రాము, రమేష్, కొండల్, బాబురావు, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, ఇమామ్, నాగ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇష్టపడి చదివితే అత్యుత్తమ ఫలితాలు



ప్రజాపక్షం/కరకగూడెం: జీవితంలో స్థిరపడటానికి పదవ తరగతి పరీక్షలు అత్యధిక కీలకమని కరకగూడెం మండల ఎంఈఓ గద్దం మంజుల పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు మ్యాథ్స్‌లో పట్టు సాధించాలని ఉద్దేశంతో బిల్లా మదన్ మోహన్ తల్లిదండ్రులైన బిల్లా జానకి, బిల్లా నర్సయ్య జ్ఞాపకార్థం ఈ మెటీరియల్ ని అందజేస్తున్నట్లు సీనియర్ జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ లింగంపల్లి దయానంద్ తెలిపారు. కరకగూడెం మండలంలోని కరకగూడెం, బట్టుపల్లి అనంతారం, జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్లో ఆయా కాంప్లెక్స్ హెడ్మాస్టర్స్, మోహన్ బాబు, కరణ్ చేతుల మీదుగా మెటీరియల్ ని అందజేశారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు, వసంత్ కుమార్, లక్ష్మ ణ్, కోట్ల రాజు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి పూజలు



ప్రజాపక్షం/సుజాతనగర్: మండల కేంద్రంలోని గుట్టపై వెలసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి దేవాలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణ చార్యులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ, సేవా కాలం, ధనుర్మాస ఆరాధన వైకుంఠ ద్వారా దర్శనం నిర్వహించారు. సుజాతనగర్ మండలంలోని వివిధ గ్రామాల నుండి భక్తులు ప్రాతఃకాలము నందు దేవాలయానికి చేరుకొని దీపారాధనలు చేసి జై శ్రీమన్నారాయణ నామ స్మరణలతో ఆలయ ప్రాగణమంతా మారు మ్రోగిపోయింది. ఆ స్వామి వారి దర్శనం కోసం భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో తీర్థప్రసాదాలు ఏర్పాటుఏర్పాటు చేశారు.

## అటవీ ఉత్పత్తులను జిసిసికే విక్రయించాలి



ప్రజాపక్షం/గుండాల : గిరిజనులు సేకరించే అటవి ఉత్పత్తులైనా ముష్టిగింజలు, చిల్లగింజలు, కరకాయలవంటి గిరిజన సహకారసంస్థలలో అమ్మకాలు జరిపి ఆదాయాన్ని పొందాలని ఇల్లందు జిసిసి మేనేజర్ నరసింహారావు తెలిపారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో అటవి ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు దళారులు వస్తున్నారని , వారు తూకంలో మోసంచేస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తూ దగా చేస్తున్నారని అన్నారు. అన్నపురెడ్డిపల్లి ఇతర ప్రాంతాలనుండి వచ్చి గిరిజనులు సేరకరించే ముష్టిగింజలను ఎక్కువధర చూపిస్తూ తూకాల్లో మోసానికి పాల్పడుతున్నారని వారిని నమ్మవద్దని పిలుపునిచ్చారు. ముష్టి గింజలకు జిసిసి ద్వారా కెజి 75రు. చెల్లి స్తుందని తెలిపారు. శుక్రవారం మండల పరిదిలోని మోదుగుల గూడెం వద్ద దళారులను పట్టుకొని పోలీసులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా గిరిజనులు దళారులను నమ్మి మోసపోవద్దని కష్టపడి సేకరించిన అటవి ఉత్పత్తులను జిసిసి కేంద్రాలలో అమ్మకాలు జరిపి లబ్ధిని పొందాలని సూచించారు. సమావేశంలో గుండాల జిసిసి సేల్స్‌మెన్ పగడయ్య ఉన్నారు.

## రైతు సమస్యలపై తహసీల్దార్ మెమోరాండం



ప్రజాపక్షం/బూర్గంపాడు: భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో రైతు సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో మెమోరాండం ఇచ్చారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించి, గత 13 నెలలుగా రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వానికి మీ ద్వారా చేయు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. రైతు భరోసా పేరుతో ఎకరాకు ఖరీఫ్ రబీ కలుపుకొని ఏడాదికి 15000 రూపాయలు ఇస్తామని చెప్పి, నేటి వరకు ఖరీఫ్ విడుదల చేయాల్సిన పెట్టుబడి సాయాన్ని విడుదల చేయలేదని, రైతు భరోసా విషయంలో కమిటీ పేరుతో కాలయాపన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను వంచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చుక్కపల్లి బాలాజీ, జిల్లా నాయకులు కేసాగాని శ్రీనివాస గౌడ్, యువ మోర్చా నాయకులు దుప్పటి సురేష్, వెలిశెట్టి రామారావు, కోడెబోయిన రవి, అంగోత్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ మండలం మద్దులపల్లి కోతులగుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని పెద్దతండా 33లెవన్‌కేవి, గుర్రాలపాడు 33లెవన్‌కేవిల పరిధిలోని జలగంనగర్ 11కేవీ, వెంకటగిరి టౌన్ ఫీడర్లలో పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు బిషప్‌హౌస్ ఏరియా, సాయిప్రభాత్‌నగర్, నాయుడుపేట, లుంబినివనం, అభయటౌన్షిప్, కేబీఆర్‌నగర్, వెంకటగిరి, ఇందిరమ్మకాలనీ, గుదిమళ్ల పంచాయతీ పరిధిలో సరఫరా ఉండదన్నారు. కావున వినియోగదాలు, వ్యాపార సముదాయల వారు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

# ప్రజాభిప్రాయ సేకరణకు 'క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్'

**-పోస్టర్‌ను ఆవిష్కరించిన సిపి సునిల్‌దత్**
**-వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి సూచనలు**




**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీసుల పనితీరు, ఆ శాఖపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు పోలీసుశాఖ నూతనంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజన్ పోస్టర్‌ను డిజిపి జితేందర్ పర్యవేక్షణలో పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ డిజిపి కార్యాలయం నుంచి విడియో కాన్ఫరెన్ ద్వారా డిజిపి ఈకార్యక్రమాన్ని ప్రారంభించి పోలీసు కమిషనర్‌లు, ఎస్పిలతో మాట్లాడి పలు సూచనలు చేశారు. బాధితులు సమస్యలు విన్నవించుకునేందుకు పోలీసు స్టేషన్లకు వెళ్లిన అనంతరం అక్కడి సిబ్బంది వ్యవహరించిన తీరు, వివిధ ఫిర్యాదులు మొదలు పాస్‌పోర్టు వెరిఫికేషన్, ఈ చలాన్, ఎఫ్ఐఆర్ తదితర సేవలు గురించి సిబ్బంది తీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు ఈ క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పోస్టర్‌ను మండల స్థాయి పోలీసు స్టేషన్లు మొదలుకొని అన్ని సర్కిల్, ఏసిపి, డిఎస్‌పిలు, ఎస్పి, పోలీసు కమిషనర్ కార్యాలయం వరకూ అన్ని పోలీసు స్టేషన్లలో అందుబాటులో ఉంచాలన్నారు. బాధితులు ఈ క్యూఆర్ కోడ్ ను వినియోగించుకుని సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు నరేష్‌కుమార్, ప్రసాద్‌రావు, ట్రైనీ ఏపిఎస్ అధికారి రుత్వక్‌సాయి పాల్గొన్నారు.

## సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయంలో ముక్కోటి ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని సారపాకలోని సాకేతపురి ఆంజనేయ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా సాకేతపురి ఆంజనేయస్వామి సేవా సమితి, సాకేతపురి హనుమార్ చాలీసా భక్త బృందం వారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా మండల పారాయణం 41 రోజు పూర్తయిన సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 4:30నుండి స్వామి వారికి అభిషేకము, వస్త్రాలంకరణ, అష్టోత్రము, ఆకుపూజ 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మాట్లాడుతూ నవబంర్ 29వ తారీఖున సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయంలో ప్రారంభమైన హనుమాన్ చాలీసా మండల పారాయణం కార్యక్రమం ప్రతి రోజు భక్తుల గృహములలో, ఆలయాలలో నిర్వహించి 41 రోజులు పూర్తి చేసుకుని ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయంలో పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రకరకాల పూలతో ఎంతో సుందరంగా ఆలయాన్ని భక్తులు అలంకరించారు. స్వామి వారిని ఉత్తర ద్వార ద్వారా దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో సాకేతపురి ఆంజనేయస్వామి సేవా సమితి, సాకేతపురి హనుమాన్ చాలీసా భక్త బృందం, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో ఘనంగా సంక్రాంతి సంబురాలు

**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ మార్కెట్ ఏరియాలో గల స్టార్ చిల్డ్రన్ హైస్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముగ్గుల పోటీలు, బొమ్మల కొలువు, భోగి పండ్లు కార్యక్రమాలను సాంప్రదాయ పద్ధతిలో జరుపుకున్నారు. ఈకార్యక్రమాని ఉద్దేశించి కరస్పాండెంట్ జి భాస్కర్‌రావు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో సాంప్రదాయ పద్ధతిలో జరుపుకునే ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని పేర్కొన్నారు. అన్ని పండుగలు తిథి ఆధారముగా జరుపుకుంటామని, సంక్రాంతి పండుగను మాత్రం కాల గమనం ఆధారంగా జరుపుకుంటామని తెలిపారు. సంక్రాంతి సూర్యునికి ప్రీతి పాత్రమైన పండుగని, అందుకనే సూర్యుని రంగు, రూపం పోలిన భోగిపండ్లలో నాణెములు, అక్షింతలు, బంతి చేమంతి పూలరెమ్మలు కలిపి చిన్న పిల్లలపై పోస్తారని దీని వల్ల సూర్య భగవానుని ఆశీర్వాదం పిల్లలపై ఉండి ఆరోగ్యంగా ఉంటారనే



విశ్వాసం ఉందని పేర్కొన్నారు. గంగిరెద్దు ఆటలు, హరిదాసు కీర్తనలు, ముత్యాల ముగ్గులు ఈ పండుగ ప్రత్యేకతలని తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన రంగవల్లుల కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సంక్రాంత్రి సంస్కృతి సాంప్రాదాయాలకు ప్రతీక అని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి పేర్కోన్నారు. మండల కేంద్రంలో మంత్రి సూచన మేరకు, ఆయన వ్యక్తిగత సహాయకులు తుంబూరు దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలం లోని వివిధ గ్రామాల నుంచి 500 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొనటం విశేషం. వారి వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. ప్రోత్సాహించటంతో వారు సంతోషపడ్డారు. అనంతరం విజేతలకు ఆమే చేతుల మీదుగా బహుమతులు అందించారు. పోటీలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రంగుల వల్లులు మన సంస్కృతి కి ప్రతీకలు అన్నారు. ముగ్గుల పోటీకి ఇంత పెద్ద ఎత్తున మహిళలు రావటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతీ తెలుగు వారు అంగరంగ వైభవంగా నిర్వహించే అతి పెద్ద పండుగా సంక్రాంత్రి అన్నారు. ప్రతీ ఇళ్లు సంతోషాలతో జరుపుకోవాలని అన్నారు. అష్టఐశ్వర్యాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, నాయకులు శాఖమూరిరమేష్, కొడాలి గోవిందరావు, కె.నాగేశ్వరరావు, జెర్రిపోతుల అంజిని, మామిడి వెంకన్న, బొడ్డు బొందయ్య, కుక్కల హనుమంతరావు, చెరువు స్వర్ణ, భద్రయ్య, బోయిన వేణు, బచ్చలకూరి నాగరాజు, రేగూరి వాసవి, యడవల్లి నాగరాజు, వంగవీటి నాగేశ్వరరావు, మేకల వెంకటేశ్వర్లు, గుండా బ్రహ్మం, గరిడేపల్లి రామారావు, కొమ్మూరి నరేష్, కడియాల శ్రీనివాసరావు, దోసపాటి శేఖర్, కొమ్మినేని విజయాబాబు, కడియాల నరేష్,మామిడి సుభద్ర, బీ.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** పోలీసు కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహిస్తూ ఇటివల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ హెచ్ కోక్యా కుటుంబ సభ్యులకు 8,00,000/ రూపాయల ఎక్స్‌గ్రేషియా నగదు చెక్కును శుక్రవారం పోలీసుకమిషనర్ సునిల్‌దత్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుని కుటుంబానికి పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## నేడు ఉభయ జిల్లాల్లో ఎంపి రఘురాంరెడ్డి పర్యటన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రాఘురాంరెడ్డి ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల్లో శనివారం పర్యటించనున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మ ల నాగేశ్వరరావుతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. తొలుత ఉదయం 10గంటలకు దమ్మపేట మండలం కట్కూర్‌లో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఉదయం 11గంటలకు పూసుకుంట గ్రామంలో ఆయిల్‌ఫామ్ ప్లాంటేషన్‌కు హాజరవుతారు. ఆతర్వాత గ్రామస్తులు, ఆయిల్‌ఫామ్ రైతులతో సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు రఘునాధపాలెం మండలం మంచుకొండలో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తారు. ఎంపి పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు.

## నేటి ముగ్గుల పోటీలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** నేడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని, ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి అన్నారు. ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లిపంచాయతీపరిధిలోని భద్రాద్రినగర్‌లో గల గరికపాటి వెంకట్రావు స్థలంలో జరగనున్న పోటీ ప్రదేశాని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలలో భాగంగా మహిళకు ఏర్పాటు చేసిన సౌకర్యర్థలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్నాయని, మహిళ సకాలంలో హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, మద్దులపల్లిమార్కెట్ కమిటీ డైరెక్టర్ తేజవత్ పంతుల్‌నాయక్, నాయకులు తోట వీరభద్రం, కోర్లకుంట శీనయ్య, గునిగంటి సురేష్, రాజశేఖర్‌రెడ్డి, లింగా శ్రీనివాస్, కొండం రామస్వామి, చీకటి శ్రీనివాస్, నగేష్ పాల్గొన్నారు.

## ఎమిలీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలీ పబ్లిక్ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ ములకలపల్లి గోపీనాథ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి వివరిస్తూ ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులు, వ్యవసాయదారుల కుటుంబంలో సంతోషించే కాలం ఈ సంక్రాంతి పండుగ సమయం అని పెద్దల నుండి సాంప్రదాయంగా వస్తున్న ఈ పండుగలను ప్రత్యేకంగా జరుపుకోవాలని, పూర్వ వైభవాలను తలపించే విధంగా ప్రతి కుటుంబంలో చేసుకోవాలని సాంప్రదాయాలను మరవద్దని, ప్రతి కుటుంబం పాడిపంటలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాను కౌలు రైతులకు వర్తింపజేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి రైతు భరోసా ను కౌలు రైతులకు కూడ వర్తింపచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్ల తో కూడిన వినతి పత్రం ను స్థానిక తహశీల్దార్ కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా మ్యానిఫస్టో లో పేర్కోన్న విధంగా రూ.2 లక్షల వ్యవసాయ రుణ మాఫీ హామీ ని సంపూర్ణంగా అమలు చేయాలని కోరారు. కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలను విడుదల చేయాలని కోరారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేల ను చెల్లించాలని డిమాండ్ చేశారు. పీయం ఫసల్ భీమా యోజన పథకం ను వెంటనే అమలు చేయాలని కోరారు. అన్ని వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల కన్వీనర్ కళ్యాణపు నాగేశ్వరరావు, ఎలిగేటి నరసింహారావు, రాపలి కొండలు, కొండా హరవరన్, కందరబోయిన గోపి చందా ప్రవీణ్, గుండెపోంగు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా సుధాకర్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** బీజేపీ మండల అధ్యక్షుడు గా మండలం లోని కొత్తకొత్తూరు కు చెందిన పాగర్తి సుధాకర్ ను నియమించారు. ఇటీవల పార్టీ సంస్తాగత ఎన్నికల ప్రక్రియ పూర్తి కావటంతో ఎన్నికల అధికారులు మండల అధ్యక్షుడు గా సుధాకర్ ను ప్రకటించారు. ఈ సందర్భంగా శుక్రవారం నూతన అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడారు. మండలం లోని పార్టీని తిరుగులేని శక్తి గా తీర్చిదిద్దేందుకు తమ వంతుగా కృషి చేస్తానని పేర్కోన్నారు. బూత్ కమిటీల ప్రకారం కార్యక్రమాలు చేపడతామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యచరణ ను రూపొందిస్తామని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల లో పార్టీ సత్తా చూపేందుకు కార్యకర్తలను కార్యోన్ముఖులను చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు గ్రామ సాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని పేర్కోన్నారు. తన పై నమ్మకంలోపార్టీ మండల అధ్యక్షుడుగా బాధ్యతలు కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, రాష్ట్ర, జిల్లా నాయకులకు ధన్యావాదాలుతెలిపారు.ఈ సందర్భంగా సుధాకర్‌ను పలువురు అభినందించారు.

# సమగ్రాభివృద్ధే మంత్రి తుమ్మల ధ్యేయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా సమగ్రాభివృద్ధే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్యేయమని ఖమ్మం కార్పోరేషన్ మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం ఖమ్మంనగరంలోని 30, 32, 33, 34, 36, 47, 48 డివిజన్లలో లబ్ది

## చెక్కుల పంపిణీలో మేయర్

దారులకు మేయర్ పునుకొల్లు నీరజ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సారధ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూర్చనున్నామన్నారు. ఖమ్మంజిల్లాతో పాటు ఖమ్మం నగర అభివృద్ధికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధిక నిధులు కేటాయిస్తున్నారని ఆమె తెలిపారు. ఇతర కార్యక్రమాల వల్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెక్కుల పంపిణీకి రాలేకపోయారని ఆలస్యం కాకుండా లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేయాలని మంత్రి తుమ్మల సూచించినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు యర్రం బాలగంగాధర్ తిలక్, కార్పొరేటర్ కన్నం ప్రసన్న, దేవత శంకర్ నాయక్, రమేష్ గౌడ్, శ్రీశైలం, మంగ, సైదులు, దివ్య, కృష్ణ, శ్రీను, రవి, రాంబాబు, శంకర్, వీరభద్రం, మల్లికార్జున్, ఉపేందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా వసతి గృహాల తనిఖీ



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి భానుమతి పాల్వంచలోని మూడు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం నవభారత్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహం, ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహం, షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని ప్రిన్సిపాల్, వార్డెన్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా వసతి గృహంలోని తరగతి గదులు, కిచెన్ రూమ్, స్టోర్ రూమ్‌లను న్యాయమూర్తి పరిశీలించారు. పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హాస్టల్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార మెనూను పరిశీలించి, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని హాస్టల్ వార్డెన్‌కు సూచించారు. షెడ్యేల్ కులాల బాలుర వసతి గృహం, పాల్వంచలో ఆహారపు మెనూను సరిగా పాటించని సిబ్బందిపై న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో న్యాయమూర్తితో పాటు సీనియర్ న్యాయవాది మెందు రాజమల్లు పాల్గొన్నారు.

# దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు బిఆర్‌పురం విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండల పరిధిలోని బురద రాఘవాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపికయ్యారు. ఈ నెల7 నుండి 9 వరకు మహబూబ్‌నగర్, జిల్లా జడ్జర్లలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో ఆ పాఠశాలకు చెందిన కె.మహిమ, ఎస్.శ్రావణి అనే విద్యార్థులు గణిత విభాగం సీనియర్స్ నుండి విజువలైజింగ్ మ్యాత్స్ అనే అంశాన్ని ప్రదర్శించి ప్రధమ బహుమతి పొందారు.ద ఈంతో ఈ విద్యార్థులను దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌కి ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఈ నెల21 నుండి 25 వరకు పాండిచ్చేరిలో జరిగే దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు వెళ్లనున్నారు. సైన్స్ ఫెయిర్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయులు సాగి సుజాత, పొట్ట రామారావును ఎంఈవో శ్రీనివాస్‌తో పాటు ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయశ్రీ, శ్రీనివాసరావు, పుల్లయ్య, భారతి, నరేష్, నాగేశ్వరావు, భావ్‌సింగ్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# జగజిత్ సింగ్ దల్లేవాల్ డిమాండ్‌లను అమలుచేయాలి




**ప్రజాపక్షం/బోనకల్ః** రైతు సంఘం జాతీయ నేత జగ్జత్ దాల్లేవాలా డిమాండ్‌లను అమలు చేయాలని, ఆయన ప్రాణాలను కాపాడాలని తెలంగాణ రైతు సంఘం మధిర డివిజన్ నాయకులు దొండపాటి నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆ సంఘం, సిపిఎం మండల కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్రం ప్రభుత్వం రైతులను తీవ్రంగా నష్టపరిచే నల్లచట్టాలను తీసుకువచ్చి రైతులను ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుందని విమర్శించారు. ఆనాడు జాతీయ రైతు సంఘం నేతల ఆందోళనలతో నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటించి దొంగచాటుగా ఈ చట్టాలను అమలుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తుందని అన్నారు. రైతు సమస్యలపై 44 రోజుల నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జాతీయ రైతు నేత ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం ఉందని, అతని ప్రాణాలను హానీ కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మినేని నాగేశ్వరావు, తుళ్లూరి రమేష్, సంఘం నాయకులు గుద్దూరి ఉమ, పత్తి రాధాకృష్ణ, గుడూరు వెంకట నరసయ్య, గుద్దూరి నాగేశ్వరరావు, గుగులోత్ నరేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు శిక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** చెల్లని చెక్కు కేసులో నిందితురాలు ఖమ్మం నగరానికి చెందిన జి. కరుణకు ఖమ్మం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాది ఏపూరి బిందుప్రియ ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 3,50,000 లను ఫిర్యాదికి చెల్లించాలని శుక్రవారం తీర్పునిచ్చారు. ఖమ్మం నగరం పాండురంగాపురంకు చెందిన ఫిర్యాది భూక్యా స్వామి వద్ద నిందితురాలైన జి. కరుణ తన కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 3,50,000లను 5.10.2014న రుణం తీసుకుని అదే రోజు ప్రాంసరి నోటు రాసి ఇచ్చింది. ఫిర్యాది తన రుణంను తిరిగి చెల్లించమని ఒత్తిడి చేయగా నిందితురాలు 7.10.2015న రూ.3,50,000లకు చెక్కు జారీ చేసింది. ఫిర్యాది తన బ్యాంకు ఖాతాలో చెక్కును జమ చేయగా నిందితురాలి ఖాతాలో సరిపడ నగదు లేకపోవడంతో చెక్కు తిరస్కరణకు గురికావడంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీసు జారీ చేసి ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు విచారించిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

**ప్రజాపక్షం/చింతకాని:** చింతకాని మండల వ్యాప్తంగా ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతకాని చెన్నకేశవ ఆలయం, నాగులవంచ కోదండ రామాలయాల్లో తెల్లవారుజామునుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకుని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మత్కేపల్లి లో జరిగిన స్వామి వారి ఊరేగింపులో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



# సీతంపేటలో ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/చింతకాని :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో సీతంపేట యూపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయలు చిన్నారులకు ముగ్గుల పోటీ లు నిర్వహించారు. మొదటి బహుమతి బూర స్నేహవర్షిణి,ద్వితియ బహుమతి ఆవుల భవ్యశ్రీ,తృతియ బహుమతి శానం సౌజన్య గెలుపొందారు. బహుమతులను పాఠశాల పూర్వ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అంబటి శాంతయ్య అందజేశారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సహదేవ్,నాగలక్ష్మి ,మహిళలు,విద్యార్థిణులు పాల్గొన్నారు.

# వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సండ్ర దంపతులు

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల శ్రీవారిని తెల్లవారుజామున సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పండితులు వేదాశీర్వచనం అందించగా, స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఏటా తిరుమల శ్రీవారిని వైకుంఠ ఏకాదశి సందర్భంగా దర్శించుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందని తెలిపారు.



# అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన మువ్వా

**ప్రజాపక్షం/సత్తుపల్లిః** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి ఇల్లు దగ్ధం అవడంతో వారి కుటుంబాన్ని శనివారం టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. బాధితుడు అయినంపూడి రమేష్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు, పొంగులేటి, మువ్వా అభిమానులు పాల్గొన్నారు.



# ఇటుక బట్టీల్లో మగ్గుతున్న బాల్యం..!





**-ఛిద్రమవుతున్న చిన్నారుల భవిష్యత్తు**
**-చోద్యం చూస్తున్న అధికారులు**

**ప్రజాపక్షం/బోనకల్‌:** మండలంలోని కలకోట గ్రామ సమీపంలోని మున్నేరు వాగు పక్కన గల ఇటుకబట్టీలలో నిండా పది, పన్నెండు యేళ్లు లేని చిన్నారులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఇటుక బట్టీలు వైరామధిర ప్రధాన రహదారి పక్కనే ఉన్నా అధికారులు చోద్యం చూస్తున్నరే తప్ప, చర్యలు తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది. ఆడుతూ పాడుతూ స్కూల్‌కి వెళ్లాల్సిన వయసులో బాల కార్మికులుగా వెట్టిచాకిరి చేయిస్తున్నా ..కార్మిక శాఖ అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదని ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఇటుగా పంచాయతీ, రెవెన్యూ, విద్యా శాఖ, కార్మిక శాఖ అధికారులు ప్రయాణిస్తూ ఈ చిన్నారుల అవస్థలు చూస్తూ, పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇక్కడ ఇటుకలు తయారీ స్థానికులు కాకుండా వరంగల్, నల్గొండ జిల్లాల కూలీలను, ఒడిశా, బీహార్ రాష్ట్రాల కూలీలను తక్కువ రేటు తీసుకువచ్చి ఇటుకలు తయారు చేయిస్తారు. వీరితో పాటు వీరి పిల్లలను కూడా నిబంధనలకు విరుద్ధంగా పనిచేయిస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వహణ కోసం ఇతర ప్రాంతాల నుంచి కార్మికుల కుటుంబాలను తీసుకువస్తున్న బట్టీల యజమానులు వారి సంక్షేమాన్ని మాత్రం విస్మరిస్తున్నారు. కార్మికులకు కనీస వసతులు కల్పించపోగా, వారి పిల్లల ఆలనాపాలనా కూడా విస్మరించి, వారితో కూడా వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఇటుక బట్టీలలో పనిచేసే కార్మికులకు వేతన చట్టంలో అనేక నిబంధనలు ఉన్నా వేతనాలు బ్యాంకు ద్వారా మాత్రమే.. చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఇటుక బట్టి వ్యాపారులు తక్కువ వేతనాలు ఇచ్చి వారి శ్రమను దోపిడి చేస్తున్నారు.

**-బాలకార్మికులను బడిలో చేర్చాలి :**
**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్**



ఇటుక బట్టీలలో పనిచేసే చిన్నారుల భవిష్యత్ ఛిద్రం అవుతున్నాయి. ఇటువంటి చిన్నారులను ప్రభుత్వాలు గుర్తించి బడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతి మండలంలో విద్యా, కార్మికశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసి బాలకార్మికులను గుర్తించి పాఠశాలలలో, హాస్టళ్లలో చేర్చాలి. కార్మిక శాఖ వారు చిన్నారుల తల్లిదండ్రులైన కార్మికులకు కనీస వేతన చట్టం నిబంధన ప్రకారం వారికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలి

**సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్**



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆర్గారంటీల హామీలను నెరవేర్చాలని సిపిఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ అన్నారు. మండల పరిధిలోని మేడిదపల్లి గ్రామంలో ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బండి రమేష్ పాల్గొని వేగినాటి మంగతాయి అధ్యక్షతనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలని ఆయన అన్నారు. ఎప్పటినుండో పెండింగ్లో ఉన్న ఫంక్షన్లో రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలని వారికి వెంటనే బ్యాంకులలో తిరిగి రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలో ఎంతోమంది భూ సమస్యల లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూమాత పేరిట ప్రభుత్వం తీసుకొస్తున్న ధరణి మార్పులను వెంటనే చేసి భూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కార్యదర్శి వర్గం ను ఎన్నుకున్నారు కార్యదర్శివర్గ సభ్యులుగా కొమ్ము శ్రీను అంగిరేకుల నరసయ్య, పద్మనాభుల సుధాకర్, వేగినాటి మంగతాయి బిగి రమేష్, కొత్తపల్లి వెంకన్న, దాసరి మహేందర్, తుళ్లూరు నాగేశ్వరరావు, 9 మందితో మండల కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.డి బసీరుద్దీన్, కొలిచలం స్వామి బండారి సైదులు మాచర్ల రాజశేఖర్ దిండు మంగపతి నర్సుల వెంకటేష్, తంగేళ్ల రమేష్, దొడ్డలింగస్వామి కోట ఉపేందర్ రెడ్డి, కోడి లింగయ్య, గోపోజ్ రవి, రమేష్, చిట్టి వెంకటరెడ్డి, మోర ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తే సైబర్ క్రైమ్ ఫ్రీ కాల్ 1930**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** సమాజంలో ప్రజలను మోసం చేసేందుకు నేరస్తులు వివిధ రూపాల్లో చోరీలకు పాల్పడుతుంటే ఇటీవల ఆన్లైన్ మోసాలు ఎక్కువ అవుతున్నాయని తిరుమలాయపాలెం అదనపు ఎస్ఐ రామలింగారెడ్డి అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఖమ్మం రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి సూచనల మేరకు శుక్రవారం మండల కేంద్రంలో సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవల సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు పేరుతో వీడియో కాల్ చేస్తూ, బెదిరిస్తూ అకౌంట్లో ఉన్న డబ్బులు తీయడం జరుగుతుందని ఆయన అన్నారు. తెలియని కాల్స్ వచ్చినప్పుడు ఫోన్ తీయకూడదని ఆన్లైన్ మోసాలు ఎక్కువ అవుతున్నాయని ఆన్లైన్ బెట్టింగులు జరుగుతున్నాయని అలాంటి వాటి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇటీవల పోలీస్



దర్యాప్తు సంస్థల పేరుతో వీడియో కాల్ వస్తే నమ్మవద్దని, అలాంటి కాల్ వచ్చినప్పుడు వెంటనే సైబర్ క్రైమ్ ఫ్రీ కాల్ 1930 కు కాల్ చేసి తెలియజేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాలేరు ఆత్మ ఛైర్మన్‌గా చావా శివరామకృష్ణ



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** పాలేరు నియోజకవర్గ ఆత్మ ఛైర్మన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ ఎన్నికయ్యారు. కూసుమంచి మండలం కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారుల కమిటీ నిర్వహించిన సమావేశంలో ఆయనను ఎన్నిక చేశారు. ఆయనతో పాటుగా డైరెక్టర్లు గా మరికొందరిని ఎంపిక చేశారు.త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. తిరుమలాయపాలెం మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన చావా శివరామకృష్ణ తొలి నుండి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రధాన అనుచరునిగా ఉంటూ ఆయన అడుగుజాడల్లో నడుస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఎ సరిత, ఏఓలు నారెడ్డీ సీతారాం రెడ్డి, రామడుగు వాణి, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మువ్వా



**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించి కాకర్లపల్లి రోడ్ లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలలో టిజిఐడిసి చైర్మెన్ మువ్వా విజయబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వారా దర్శనం ద్వారా స్వామిని దర్శించుకున్న అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్తుపల్లి పట్టణంలో పలు కుటుంబాలను మువ్వా పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిజిఐడిసి చైర్మెన్ మువ్వా విజయబాబు తో పాటు కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, మధు, కాంగ్రెస్ నాయకులు కొత్తూరు కోటేశ్వరరావు, కాలినేని రాజేష్, దొడ్డా కిషోర్, దొడ్డా అమ్ములు, చంద్రశేకర్, వేంపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లాడ మండల బిజెపి నూతన అధ్యక్షునిగా చల్లా నాగులు



**ప్రజాపక్షం/తల్లాడ :** తల్లాడ మండల బిజెపి పార్టీ నూతన అధ్యక్షునిగా చల్లా నాగులు ఎన్నికయ్యారు. అనతికాలంలోనే పార్టీ అభివృద్ధికి మండల స్థాయి నుండి ఎంతగానో కృషి చేసి పార్టీ ప్రతిష్టకు దోహదపడిన నాగులను అధిష్టానం తల్లాడ బిజెపి పార్టీ అధ్యక్షునిగా నియమించారు. ఈసందర్భంగా నాగులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షునిగా నియమించిన అధిష్టానానికి, పదవి వచ్చేందుకు సహకరించిన మండల నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తల్లాడ మండలంలో పార్టీ అభివృద్ధికి తనవంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు



**ప్రజాపక్షం/ఏన్కూరుః** మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నాచారం శ్రీఅద్భుత వెంకటేశ్వరస్వామి గార్లవొడ్డు లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయాల్లో శుక్రవారం మహిళలు, ప్రజలు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో పూజారులు ఉత్తర ద్వారం తెరిచి భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల ధ్వజ స్థంభాల వద్ద భక్తులు పసుపు, కుంకుమ వేసి పూజలు చేశారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు స్వామి వార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ ప్రసాద్, వేద పండితులు, నాగరాజాచార్యులు, వేణుగోపాలచార్యులు, గ్రామస్థులు శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, కోసూరి నర్సింహారావు, చందమామ నర్సింహారావు, వరశంకర ప్రసాద్, మానుకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు స్వీకరించేందుకు క్యూఆర్ కోడ్



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు తమతో పోలీస్ స్టేషన్ అధికారి, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఫిర్యాదు స్వీకరించే విషయంలో, ఎఫ్ఐఆర్ నమోదు చేసే విషయంలో, ఈ చలానా జరిమానా విధించే సమయంలో, ఏ విధంగా వ్యవహరించారు మరియు సిబ్బంది పనితీరు గురించి క్యూర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయం తెలియపరచాలనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, డిజిపి డాక్టర్ జితేందర్ అమలుపరిచిన క్యూఆర్ కోడ్ విధానం ద్వారా ఫిర్యాదుదారులు మరియు మండల ప్రజలు తమ యొక్క అభిప్రాయాన్ని తెలియపరచాలని నూతన క్యూఆర్ కోడ్ ను ప్రవేశపెట్టడం జరిగినది. ఈ క్యూఆర్ కోడ్ శనివారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ నందు ఎస్.ఐ రవి సిబ్బందితో కలిసి స్టేషన్ నందు అంటించారు.